ప్రయాణికులకు నీడ కరువు

- బస్ షెల్టర్లకు నోచుకోని నిడిగొండ
- బస్సుల కోసం హైవేపై ఎండలో పడిగాపులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



ఎండలో నిలబడి బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

రఘునాథపల్లి: హనుమకొండ–హైదరాబాద్ జాతీయ రహదారిలోని నిడిగొండ వద్ద ప్రయాణికులకు బస్‌షెల్టర్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైవేపై ఇరువైపులా ప్రయాణికులు ఎదురు చూసేందుకు బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయకపోవడంతో ఎండలో నిలబడలేక నానా అవస్థలు పడుతున్నారు. నిడిగొండ ఇరువైపుల గ్రామాలైన ఫతేషాపూర్, ఇబ్రహీంపూర్, లక్ష్మీతండా, మాదారం, సోమయ్యకుంటతండా, ఖిలాషాపూర్, మండలగూడెం, శ్రీమన్నారాయణపురం ఎల్లారెడ్డిగూడెం, బాంజీపేట, కన్నాయపల్లి గ్రామస్తులు నిత్యం వందలాది మంది ఇక్కడి నుంచే హైదరాబాద్, హనుమకొండకు ప్రయాణాలు సాగిస్తుంటారు. నిలువ నీడ లేక బస్సుల కోసం వచ్చి హైవేపై ఎండలో నిలబడి పడిగాపులు కాయాల్సి వస్తోంది. నిత్యం నానా ఇబ్బంది పడుతున్నా, పలు ప్రమాదాలు చోటుచేసుకున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. గతంలో ఇక్కడ అన్ని గ్రామాలకు కేంద్రంగా బస్టాండ్ ఉండేది. ఫోర్‌లైన్ విస్తరణలో బస్టాండ్ కోల్పోగా నేషనల్ హైవే అధికారులు తిరిగి నిర్మించకపోవడంతో ఐదేళ్లుగా వేసవిలో, వర్షాకాలంలో ఎండకు ఎండి, వానకు తడవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్‌షెల్టర్లను ఏర్పాటు చేయాలని పలు గ్రామాల ప్రయాణికులు కోరుతున్నారు.

బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలి



ఇక్కడ బస్‌షెల్టర్లు లేక పలు గ్రామాల నుంచి వచ్చే ప్రయాణికులు హనుమకొండ, హైదరాబాద్ వెళ్లేందుకు నిత్యం బస్సుల కోసం ఎండలో నిలబడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలంలో కూడా తడవాల్సిందే. హైవేపై నిలబడటంతో పలు ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి హైవే ఇరువైపులా ప్రయాణికులకు బస్‌షెల్టర్లను ఏర్పాటు చేయాలి.

\- కాలూరి శ్రీనివాస్, నిడిగొండ

ప్రభుత్వం దృష్టి సారించాలి



నిడిగొండలో గతంలో బస్టాండ్ ఉండేది. రహదారి విస్తరణలో కోల్పోయింది. తిరిగి నిర్మించకపోవడంతో అప్పటి నుంచి ప్రయాణికులు ఇరువైపులా బస్సుల కోసం హైవేపైనే నిరీక్షిస్తున్నారు. నిలబడటానికి కనీసం నీడ కూడా లేదు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని బస్ షెల్టర్లు ఏర్పాటు చేసి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలి.

\- మైలారపు ఆంజనేయులు, నిడిగొండ

క్లుప్తంగా

బెల్లయ్యనాయక్‌ను కలిసిన గిరిజన నాయకులు



రఘునాథపల్లి: గిరిజన కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకమైన బెల్లయ్యనాయక్‌ను మండలంలోని గిరిజన నాయకులు ఆదివారంమర్యాదపూర్వకంగా కలిశారు. లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు, మేకలగట్టు ఎంపీటీసీ బానోత్ భిక్షపతినాయక్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో బెల్లయ్యనాయక్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు, శాలువాలతో అభినందించారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు ధరావత్ కిషన్, దిరావత్ గణేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత ఉత్సవాలు వాయిదా



జనగామ రూరల్: పట్టణంలోని దుర్గామాత ఉత్సవాలు వాయిదా పడ్డాయి. ఆదివారం పట్టణ కుల సంఘాల నాయకులు సమావేశం నిర్వహించి వచ్చే నెల 26 నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలు అక్టోబర్ నెలకు వాయిదా వేస్తున్నట్లు నిర్ణయం తీసుకున్నారు. ప్రముఖ సిద్ధాంతి కృష్ణమాచార్య ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని పట్టణ ప్రజలు గమినించి సహకరించాలని వారు కోరారు. ఆలయ పూజారి రాజలింగం, దేవాలయ అధ్యక్షుడు పిట్టల సత్యం, మున్సిపల్ చైర్మన్ పోకల జమున, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



బచ్చన్నపేట: సీపీఐ మండల కార్యదర్శి బంటు పాండు భార్య పద్మ మండలంలోని ఆలింపూర్ గ్రామంలో ఆదివారం మృతి చెందింది. కాగా, సీపీఐ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె మృత దేహంపై ఎర్ర జెండా కప్పి నివాళులర్పించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆది సాయన్న, మంగళంపెల్లి జనార్దన్, సిద్దిపేట జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఈరి భూమయ్య, ఉమ్మెంతల వెంకట్ రెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

27న సంత వేలం

కొడకండ్ల: మండలకేంద్రంలో ప్రతీ గురువారం నిర్వహించే సంత వేలంను ఈ నెల 27వ తేదీ ఉదయం 11 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి గంట శ్రీనివాస్ తెలిపారు. వేలంలో పాల్గొనదల్చిన వారు 26వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు రూ.20 వేల డీడీ, డిపాజిట్‌తో పాటు రూ. వెయ్యి చెల్లించి షెడ్యూల్ పొంది వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

చేయూత



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని మీదికొండ గ్రామానికి చెందిన జోగు కొమురయ్య ఇటీవల మృతిచెందగా బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పొదల రాజు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి కుటుంబానికి రూ.2వేలు సాయం, 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. కొమురయ్య మృతిపై ప్రగాఢ సంతాపం తెలిపారు. నాయకులు పొదల గట్టయ్య, వెంకటయ్య, పాపయ్య, రాజు, ప్రవీణ్, సాంబరాజు ఉన్నారు.

'క్షయ' రహిత సమాజమే లక్ష్యం



ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

నర్మెట: క్షయవ్యాధి రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు ముందుకు సాగాలని మండల వైద్యాధికారిణి రవళి స్టెల్లా అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణా దినోత్సవం సందర్భంగా సిబ్బందితో కలసి మండలకేంద్రంలో ఆదివారం అవగాహనా ర్యాలీ నిర్వహించిన ఆమె వారిచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడారు. వారం రోజులు నిర్విరామంగా దగ్గ ఉన్నచో డాక్టరును సంప్రదించి మందులను వాడాలని, ప్రారంభదశలో క్షయ నిర్మూలించడం సులభమని అన్నారు. వ్యాధిగ్రస్తులు భయాందోళన చెందాల్సిన పనిలేదని పౌష్టికాహారం తీసుకోవడంతోపాటు క్రమం తప్పకుండా వైద్యుల సూచనలతో మందులు వాడాలని తెలిపారు. ఉచిత మందులతో పాటు ప్రతీ నెల రూ.500 పౌష్టికాహార నిమిత్తం అందజేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జయపాల్‌రెడ్డి, హెచ్ఎస్‌లు ఆర్ఎం భాగ్య, పి. పద్మావతి, ఎల్‌టి మల్లయ్య, ఎస్ఎన్ఎం.సామ్రాజ్యం, ఫార్మసిస్టు అనిల్ కుమార్, సిబ్బంది ఐలయ్య, అరుణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



పూజలు చేస్తున్న అర్చకులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని తిరుమలనాథ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతీ రోజూ పూజలు కొనసాగుతున్నాయి. స్వామివారికి ఆదివారం ఉదయం మంగళ వాయిద్యాలు, సుప్రభాతసేవ, అష్టోత్తర శతనామార్చన, బాలభోగం, మధ్యాహ్నం నివేదన తీర్థ ప్రసాదగోష్టి, సాయంత్రం నిత్యహోమం, బలిహరణం, పూజలను నిర్వహించారు. ఆలయ అర్చకులు కలకోట రంగాచార్యులు, రామానుజచార్యులు, శేషాచార్యులు, రంగాచార్యులు, శ్రీనివాసచార్యులు, నరేషాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులు యాద శ్రీనివాస్, కొలిపాక సతీష్, తెల్లాకుల రామక్రిష్ణ, కుంభం నరేందర్, కొడ లక్ష్మీనారాయణ, సరాబు ఆంజనేయులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి'

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) కాకుండా ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక టెట్ నిర్వహించాలని పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు గీరెడ్డి ప్రమోద్‌రెడ్డి కోరారు. డివిజన్‌కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేయనున్నట్లు ప్రభుత్వం నిర్ణయించడం శుభసూచకమన్నారు. టెట్ నిర్వహణపై ఉపాధ్యాయుల్లో అసంతృప్తి ఉందని, డీఎస్సీ పరీక్షకు ముందే టెట్ నిర్వహించాలన్నారు. 2010 తర్వాత ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు ఖచ్చితంగా టెట్ పాస్ కావాలనే నిబంధన ఉండటంతో టెట్ పరీక్ష అర్హత ఉంటేనే వారికి పదోన్నతులు వస్తాయన్నారు. ఇలాంటి ఉపాధ్యాయుల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా టెట్ నిర్వహించి అందులో ఉత్తీర్ణత పొందిన వారికి పదోన్నతులు కల్పించాలన్నారు.

హరీశ్‌రావుకు ఘనస్వాగతం



కొడకండ్ల: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు ఆదివారం మండలకేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. పెద్దవంగర మండలం వడ్డేకొత్తపల్లిలో దివంగత మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌రావు సంతాప సభలో పాల్గొనేందుకు వెళ్తున్న హరీష్‌రావుకు మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు స్వాగతం పలికి సన్మానం చేశారు.

ముగిసిన దుర్గామాత వేడుకలు



పూజ చేస్తున్న మాజీ సర్పంచ్ దంపతులు

రఘునాథపల్లి: మండలంలోని లక్ష్మాతండా శివారు రామచంద్రగూడెంలో రెండు రోజుల పాటు నిర్వహించిన దుర్గామాత వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. శనివారం అర్ధరాత్రి దాటాక దుర్గామాతకు గ్రామస్తులు ఊరుమ్మడిగా డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపుగా బయలు దేరారు. గ్రామంలోని బొడ్రాయి వద్దకు బోనాలతో చేరుకొని అక్కడి నుంచి శివసత్తుల పూనకాలతో దుర్గామాత ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించారు. మధ్యాహ్నం దుర్గామాతకు మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ సర్పంచ్ పయ్యావుల లావణ్యకుమార్, యామంకి ఎలేందర్, యామంకి ఉప్పలయ్య, వొట్టెం ఉప్పలయ్య, మహేందర్, పయ్యావుల రవి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

అభినందనీయం



డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

జనగామ రూరల్: విద్యార్థుల వికాసానికి సహస్ర పాఠశాల చేస్తున్న కృషి అభినందనీయం అని రిటైర్డ్ కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి అన్నారు. ఆదివారం పట్టణంలోని సహస్ర కిడ్స్ స్కూల్ 5వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భిక్షపతి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం చిన్నారులు నృత్యప్రదర్శనలు పలువురిని అలరించాయి. పాఠశాల కరస్పాండెంట్ కీర్తి వీరేందర్, డైరెక్టర్ బల్వంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ సునీత, టీచర్లు మాధవి, సరిత, స్వప్న, జ్యోతి, ఉమ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కామదహనం



లింగాలఘణపురం: గ్రామాల్లో కోలల పండుగ ఆదివారం రాత్రి ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు కోలలు ఆడి గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన మంటల్లో కోలలు వేయడం, మహిళలు సంప్రదాయంగా కల్లు, బెల్లం పానకం, గుడాలు వేసి ఆ మంటల చుట్టూ తిరిగి కామదహనం చేశారు.

భవిష్యత్ లక్ష్యాలు నిర్ధేశించుకోవాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశలోనే భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకుని లక్ష్యసాధనకు ప్రణాళికయుతంగా కష్టపడి చదివితే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని సేయింట్‌థామస్ హైస్కూల్ చైర్మన్, ప్రిన్సిపాల్ కేసీ జాన్‌బన్నీ అన్నారు. డివిజన్ కేంద్రంలోని సేయింట్‌థామస్ హైస్కూల్ 40వ వార్షికోత్సవ వేడుకలను శివునిపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా పాఠశాల విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఇవాన్‌జాన్, ఉపాధ్యాయులు నతానియల్, వేశ్న సురేందర్, గిరిధర్, శోభన్, రాజు, అనూష, సరిత, మాధవి పాల్గొన్నారు.

భగవద్గీత సారమే మోక్ష మార్గం



భగవద్గీతను పరిచయం చేస్తున్న సమితి సభ్యులు

రఘునాథపల్లి: భగవద్గీత సారం మోక్షానికి మార్గమని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు దేవేంద్ర, రామరాజులు అన్నారు. ఆదివారం మండలంలోని వెల్దిలో హిందూ జ్ఞాన వేదిక భువనగిరి, జనగామ, చేర్యాల కమిటీల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల స్వామి వారు రచించిన 100 అధ్యాత్మిక గ్రంథాలను పరిచయం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముక్తి పొందాలంటే భగవద్గీతలో భగవంతుడు చెప్పిన ధర్మ యుక్తమైన కర్మయోగం, బ్రహ్మ యోగాలు ఆచరరించడంతో సాధ్యమన్నారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు భాస్కర్, శంకర్, యాదగిరి, ఉపేందర్, శ్రీవాత్సవ్, లత, రాజేశ్వరి, సక్కుబాయి, కవిత పాల్గొన్నారు.

డాక్టరేట్ గ్రహీతకు సన్మానం



బ్రహ్మచారిని సన్మానిస్తున్న నాయకులు

బచ్చన్నపేట: తెలుగు లిటరసీలో గౌరవ డాక్టరేట్ పొందిన ఉప్పలోజు బ్రహ్మచారికి ఆదివారం మండల కేంద్రంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో విశ్వకర్మ నాయకులు శాలువాలతో సన్మానం చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ విశ్వకర్మ నాయకుడికి అరుదైన అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. నాయకులు వెల్దుర్తి శ్రీనివాస్, నర్సింహాచారి, సాంబయ్య, భాస్కర్, కృష్ణమూర్తి, ధర్మాచారి, శ్రవణ్‌కుమార్, ప్రశాంత్, శ్రీకాంత్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'మట్టల ఆదివారం'



లింగాలఘణపురం: ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



జనగామ రూరల్: ర్యాలీలో చిన్నారులు, తదదితరులు



దేవరుప్పల: మట్టల వేడుకలో విద్యార్థినులు

లింగాలఘణపురం: మండలంలోని జెరోం మెమోరియల్ బాప్టిస్టు చర్చిలో ఆదివారం మట్టల ఆదివారం వేడుకను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చిన్నారులు, సంఘ సభ్యులు అంతా కలిసి ఈత మట్టలను పట్టుకొని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. హోసన్నకు జయం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ తీశారు. కార్యక్రమంలో సంఘ కాపరి ఎ.ప్రవీణ్‌కుమార్‌సంధ్య, అధ్యక్షుడు నల్ల అశోక్, కార్యదర్శి విజయ్‌కుమార్, కోశాధికారి నల్ల విజయ్, ఉపాధ్యక్షుడు గొంగళ్ల రాజు, కుమార్, సహాయ కార్యదర్శి ప్రభుకిరణ్ పాల్గొన్నారు.

ఉంద్రుపుర చర్చిలో..

జనగామ రూరల్: పట్టణంలోని ఉంద్రుపుర సెటినరీ బాప్టిస్టు చర్చిలో సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్కూల్ చిన్నారులతో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ తీశారు. కార్యక్రమంలో పసుల ఏబేల్, చిన్నారులు, పాస్టర్లు, తదితరులు తెలిపారు.

బాలయేసులో..

దేవరుప్పల: మండల కేంద్రంలోని బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ఆవరణలో క్రైస్తవ భక్తులకు శుభసూచికమైన ఆదివారం పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బ్రదర్ జసురాజు ఆధ్వర్యంలో మట్టలను ధరించి కొవ్వొత్తుల ప్రదర్శనతో యేసు ఆశీస్సులు పొందేలా ఆత్మపరిశుద్ధ ప్రార్థనలు చేసి తమ భక్తిప్రపత్తులు ప్రకటించుకున్నారు. విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప పెద్ద పండుగ



జల బిందెలతో వస్తున్న మహిళలు

బచ్చన్నపేట: కురుమల ఆరాధ్య దైవమైన బీరప్ప పెద్ద పండుగను మండలంలోని కేసిరెడ్డిపల్లిలో కురుమ కులస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పండుగను నిర్వహించే గురువు దిడ్డిగ లచ్చయ్య ఆధ్వర్యంలో దేవుడికి పాలు, నెయ్యి పోశారు. మహిళలు జల బిందెలను ఎత్తుకొని వచ్చి బీరప్ప గుడిలో పోయగా పండుగను నిర్వహించే తేదీలను ఖరారు చేశారు. ఏప్రిల్ 27వ తేదీ నుంచి మే 3వ తేదీ వరకు పండుగను చేయడానికి ముహూర్తాన్ని పూజారులు ఖరారు చేశారు. అనంతరం లగ్న పత్రికను రాసుకొని బీరప్ప దేవుని ఒగ్గు కథను చెప్పారు. కార్యక్రమంలో కుల పెద్ద జక్కుల కనుకయ్య, సిమ్మ నర్సింహులు, కొల్లె మల్లయ్య, జక్కుల అయ్యాల్లం, రాజయ్య, ఎల్లయ్య, లక్ష్మణ్, పర్శరాములు, గిరి, బీరయ్య, రాములు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

జనగామ రూరల్: పట్టణంలోని శ్రీసరస్వతి శిశు మందిర్ 1998–1999 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఆనందంగా గడిపారు. తమకు చదువు చెప్పిన గురువులు గణేష్, లలిత, రేణుక, అనురాధ, కృష్ణవేణిలను శాలువాలతో ఘనంగా సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా 'చెత్త' రిక్షాలు



నిరుపయోగంగా ఉన్న చెత్త సేకరించే రిక్షాలు

స్టేషన్‌ఘన్‌పూర్: గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల కోసం గత ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలకు అందించిన చెత్త తరలించే రిక్షాలు నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లో వార్డులకు వెళ్లి చెత్త సేకరించాల్సిన రిక్షాలు సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారాయి. డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌తో పాటు మండలంలోని శివునిపల్లి, కొత్తపల్లి తదితర గ్రామాల్లో చెత్త తీసుకెళ్లే రిక్షాలు తుప్పు పట్టి మూలకు చేరాయి. పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యం, ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ లోపంతో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఈ విషయమై సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అంతర్గత సమస్యలు పరిష్కరించుకుందాం



మాట్లాడుతున్న హరిప్రసాద్‌రావు

దేవరుప్పుల: కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత సమస్యలను సమన్వయంతో పరిష్కరించుకుందామని మండల ఇన్‌చార్జ్ కాకిరాల హరిప్రసాద్‌రావు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఇటీవల మండల అధ్యక్షుడి మార్పుతో నెలకొన్న సమస్య పేరిట పార్టీ విజయం కోసం పాటుపడిన నిఖార్సైన నాయకులు, కార్యకర్తలు అయోమయంలో పడాల్సిన అవసరం లేదన్నారు. దేవునిగుట్ట పరిరక్షణ కోసం ఎమ్మెల్యే యశస్విని, ఝాన్సీరెడ్డి కట్టుబడి ఉన్నారన్నారు. దేవరుప్పుల మండల అధ్యక్షుడిగా కొనసాగిన పెద్ది కృష్ణమూర్తికి సముచిత స్థానం కల్పించే దిశలో పార్టీ యోచిస్తోందని, తను కూడా పార్టీ అంతర్గత సమస్యను రోడ్డెక్కియ్యకుండా పాటుపడాలని సూచించారు. ఏదీ ఏమైనా పార్టీ వ్యతిరేక విధానాలకు తావివ్వకుండా పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు అత్యధి మెజార్టీ సాధించేందుకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీరాములు, మాజీ అధ్యక్షుడు సురేష్‌బాబు, ధర్మారెడ్డి, ఓడపల్లి రవీందర్, రసూల్, పాండు, గణేష్, నాగరాజు, నరేష్, రమేష్, మాలతి, సావిత్రి ఉన్నారు.